# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-05-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1) ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం కొనసాగుతోంది.**

**2) పుట్టపర్తిలో లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించే యుద్ధ విమానాల తయారీ కేంద్రానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ రేపు శంకు స్థాపన చేయనున్నారు.**

**3) గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో 18 కోట్ల రూపాయల వ్యయంతో కొనుగోలు చేసిన అత్యాధునిక పెట్ స్కానింగ్ యంత్రాన్ని వైద్య ఆరోగ్య శాఖమంత్రి వై. సత్యకుమర్ యాదవ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈరోజు ప్రారంభిస్తారు.**

**4) రాగల రెండు రోజుల్లో రాష్ట్రంలో ఒక మోస్తరు నుంచి ఉరుములుతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి అధ్యక్షతన అమరావతి సచివాలయంలో రాష్ట్ర మంత్రి మండలి సమావేశం కొనసాగుతోంది. నలభైకి పైగా అంశాలతో కూడిన అజెండాతో సమావేశం జరుగుతోంది. ఇటీవల రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి- S.I.P.B సమావేశంలో చర్చించిన 2 లక్షలకోట్ల పెట్టుబడులు.. ప్రోత్సాహకాలపైనా ఈ సమావేశంలో చర్చించి, ఆమోదం తెలిపే అవకాశం ఉంది. పరిపాలనా సంస్కరణలు, సంక్షేమంతో పాటు అమరావతి నిర్మాణ అంశాలపైనా సమావేశంలో చర్చించనున్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇటీవల ప్రకటించిన పొదుపు చర్యలపై రాష్ట్ర మంత్రి మండలి చర్చించిన అనంతరం పొదుపు చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

-------------------------

శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్ రేపు శంకు స్థాపన చేయునున్నారు. 650 ఎకరాల్లో లక్ష కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమ ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలులభిస్తాయని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్‌లో రాయలసీమ టెక్నాలజీ కేంద్రంగా మారబోతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చంద్రబాబు నాయుడు వివరిస్తూ ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తమ కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను తగ్గించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కాన్వాయ్ వాహనాల సంఖ్య 11 నుంచి 4కు తగ్గింది. ఈరోజు ఆయన ఉండవల్లి నివాసం నుంచి నాలుగు కార్ల వాహన శ్రేణితో అమరావతిలోని రాష్ట్ర సచివాలయంకి వచ్చారు. కాగా.... ఉపముఖ్యమంత్రి పవన్ తన కాన్వాయ్ సగానికి కుదించుకున్నారు. జెడ్ కేటగిరీ భద్రత ఉన్న పవన్ కళ్యాణ్ తన వాహన శ్రేణిలో 50 శాతం వాహనాలు తగ్గించాలని తన భద్రత అధికారులకు స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా ఈరోజు నుంచి అధికారులు కాన్వాయ్‌లో మార్పులు చేశారు.

---------------------------

పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం ఎస్.కొండేపాడు గ్రామంలో నిన్న కలుషిత ఆహారం తిని 12 మంది అస్వస్థతకు గురయ్యారు. నిన్న ఉదయం మైదా పిండితో చేసిన రొట్టెలు తిన్న వారికి సాయంత్రానికి వాంతులు విరేచనాలు అయి ఇతర అస్వస్థత లక్షణాలు కనిపించాయి. సమాచారం తెలుసుకున్న అధికారులు బాధితులలో నలుగురిని తణుకు ఆసుపత్రికి, మిగిలిన ఎనిమిది మందిని భీమవరం ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు, శాసన సభ్యుడు ధర్మరాజు ఆస్పత్రులకు వెళ్లి బాధితులను పరామర్శించారు. ... కాగా నీటి పారుదల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు ఈరోజు అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్ , ఎస్పీల తో మాట్లాడి భాదితులు ఉపయోగించిన మైదా పిండి కి సంబందించి, ఫుడ్ సేఫ్టీ అధికారులతో సమగ్ర దర్యాప్తు జరపాలని ఆదేశించారు. భాదితులు ఎక్కడ వైద్యం చేయించుకున్నా, ప్రభుత్వమే భరించేలా వారికి సహకారం అందించాలని మంత్రి జిల్లా కలెక్టర్‌కు సూచించారు.

---------------------------

గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో 18 కోట్ల రూపాయల వ్యయంతో కొనుగోలు చేసిన అత్యాధునిక పెట్ స్కానింగ్ యంత్రాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ లతో కలిసి ఈరోజు ప్రారంభించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18 ప్రైవేట్ కార్పొరేటు ఆసుపత్రుల్లో ఉన్న పెట్ స్కాన్ సదుపాయాన్ని పేద మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేందుకు గుంటూరు ప్రభుత్వాసు పత్రిలోని నాట్కో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. పెట్ స్కాన్ యంత్రం ఉపయోగాన్ని గుంటూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ యశస్వీ రమణ వివరిస్తూ ..

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

పోలవరం జిల్లాలోని ఐటీడీఏ పరిధిలో ప్రధాన మంత్రి జన్మన్ , ధర్తి ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకాల అమలుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన నిన్న రంప చోడవరంలో ఐటీడీఏ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. జన్ భాగీదారి-సబ్పేదూర్, సబ్సే పహల్ పేరుతో మే 18 నుంచి 25వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహించే ప్రచార కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. గిరిజనులు, ముఖ్యంగా

కేంద్ర ప్రభుత్వం గుర్తించిన గిరిజన సమూహాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో పొందేలా గ్రామ స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు.

--------------------------

తయారీరంగంలో తిరుపతి జిల్లా రాష్ట్రంలోని ఇతర జిల్లాలకంటే ముందంజలో ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. ఆయన నిన్న తిరుపతి కలెక్టరేట్‌లో తిరుపతి ప్రాంతీయ ఆర్దికాభివృద్ధి పై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలో తయారీ, మౌలిక సదుపాయాలతో పాటు ఓడరేవు, జాతీయ రహదారులు,రాష్ట్ర రహదారులతో అనుసంధానమై ఉందన్నారు. తిరుపతి జిల్లాను పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు కృషి చేయాలని మీనా అన్నారు.

--------------------------

పశ్చిమ-మధ్య బంగాళాఖాతంపై నిన్న ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాగల రెండురోజుల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి వెంకటరావు వివరిస్తూ ..

.. వాయిస్.. 22 సెకన్లు

--------------------------

స్వచ్ఛాంధ్ర సచ్ఛ సంరక్షణలో భాగంగా విజయవాడ నగర పాలక సంస్ద చెత్త డంపింగ్ యార్డు కోసం కొనుగోలు చేసిన 5 జేసీబీ యంత్రాలను విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాధ్ , శాసన సభ్యులు బొండా ఉమామహేశ్వర రావుతో కలిసి ఈరోజు ప్రారంభించారు. విజయవాడను కాలుష్య రహిత నగరంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

--------------------------

విశాఖపట్నం జిల్లాలో పెట్టుబడులను ఆకర్షించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఆయన నిన్న కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో జిల్లాలో పెట్టుబడులు, పరిశ్రమల స్థాపన అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటికే కుదిరిన అవగాహన ఒప్పందాలు, వాటి ప్రగతి, గ్రౌండింగ్ దశలో ఉన్న ప్రాజెక్టులు, నిర్మాణ పనుల స్థితిగతులపై అధికారులు సమగ్ర వివరాలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా భూ బ్యాంక్‌ను గుర్తించి ప్రభుత్వ భూములతో పాటు అవసరమైతే ప్రైవేటు భూములను కూడా సమీకరించే అవకాశాలను పరిశీలించాలన్నారు. పరిశ్రమల స్థాపనకు అనువైన భూభాగాలను ముందుగానే గుర్తించి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

--------------------------

అల్లూరి సీతారామరాజు జిల్లాను ప్రకృతి వ్యవసాయానికి ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ టి . నిషాంతి అన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగు పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించేందుకు వివిధ శాఖల అధికారులతో ఆమె నిన్న పాడేరు కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు.

======================